క్లుప్తంగా

మేకపాటి విజయం ఖాయం



రాజమోహన్‌రెడ్డిని కలిసిన గొల్లపల్లి తిరుపతి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజాగోపాల్‌రెడ్డి విజయం ఖాయమని, టీడీపీ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఓటర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడిచారని ఉదయగిరి బిట్–2 ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి తిరుపతి అన్నారు. ఆయన సోమవారం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన ఎన్నికల గురించి చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు.

ఉచిత ఖత్నాలు

ఉదయగిరి: పట్టణంలోని ఓ కళాశాల ఆవరణలో రహతులీల్ అలామీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు సోమవారం ఉచిత ఖత్నాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దస్తగిరిఅహ్మద్, జాఫర్ అహ్మద్, ఎస్దాని, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. ఆరుతడి పంటలు మేలు

ఆత్మకూరురూరల్: జిల్లాకు జలనిధిగా ఉన్న సోమశిల జలాశయంలో నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో బోర్ల కింద పంటలు సాగు చేసే వారు కూడా ఆరుతడి పంటలు వేసుకోవడం మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా పంటల సాగుకు పూనుకోవాలని చెబుతున్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో పంటల సాగుకు సంబంధించి స్థానిక మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు పలు సూచనలు చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోర్ల కింద సాగు చేసే వరి పంటకు ఒక ఎకరాకు అందించే సాగునీటితో ఐదు నుంచి ఏడు ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వరి నాటిన రైతులు పంట ఎండిపోవడంతో పాటు కాండం కుళ్లు తెగులు, సల్ఫేట్ ఇంజూరి తదితర సమస్యల వల్ల పంట దెబ్బతినడంతో పాటు దిగుబడులు నామమాత్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. వివిధ రకాల తెగుళ్లకు తట్టుకొనే పెసర, మినుము, జొన్న, సజ్జ పంటలను కూడా ఆయా ప్రాంతాలకు అనుగుణంగా రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. ఇటీవల మొక్కజొన్న, సజ్జ, జొన్న పంటలకు సంబంధించి ప్రైవేట్‌గా హైబ్రిడ్ విత్తనాలు కూడా రైతులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలైన జీలగలు, మినుము, పిల్లిపెసర తదితర విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం జూన్ నుంచి రైతులకు అందిస్తుందని తెలిపారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి నివాళి



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గౌడహాస్టల్ సెంటర్‌లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు 67వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నీతి, నిజాయితీ మూర్తీ భవించిన మహోన్నత వ్యక్తి ఆంధ్రకేసరి అని కొనియాడారు. బ్రాహ్మణ సంఘ నాయకులు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, శ్రీధర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీరామలాలశర్మ 'భాష్య సూత్ర ప్రవచన సప్తాహం'లో భాగంగా మూడోరోజు సోమవారం 'చతుస్సూతి' ప్రవచనం చేశారు. అథతో బ్రహ్మ జిజ్ఞాస అనే మహావాక్యాన్ని ఆదిశంకరుల వారు తమ శారీరక మీమాంస గ్రంథంలో ఎలా వివరించారో లక్ష్యార్థ వాక్య పూర్వకంగా విశ్లేషించారు. అద్వైత సిద్ధాంత సారాన్ని, వేదబోధ చేశారు. అనంతరం శ్రీరామలాలశర్మను సభాపోషకులు తాడికొండ శ్రీరామకృష్ణశర్మ, డాక్టర్ పీ చంద్రశేఖర్, చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీకి చెందిన చక్రాల ఆనంద్‌కుమార్, ములుముడి ఉదయ్‌కుమార్‌శర్మ, ఎం లక్ష్మీనరసింహారావు, జీ ప్రభాకర్‌శర్మ, పీ ఛాయాకుమారి ఘనంగా సత్కరించారు. తొలుత స్వయంపాకుల సుబ్రహ్మణ్యంశర్మచే విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

వేసవిలో కూల్ కూల్

- పుచ్చకాయలో విలువైన పోషకాలు
- వేసవి తాపం నుంచి ఉపశమనం
- జోరుగా పుచ్చకాయల వ్యాపారం



వింజమూరులో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

ఉదయగిరి: వేసవిలో పుచ్చకాయలకు మంచి గిరాకీ ఉంది. ఎండాకాలంలో పుచ్చకాయ తినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గత రెండు నెలల నుంచి పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ ఏడాది పుచ్చకాయల వ్యాపారం చాలా బాగుందని వింజమూరుకు చెందిన పుచ్చకాయల వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది టన్ను పుచ్చకాయల ధర రూ.10 వేలు నుంచి రూ.12 వేల వరకు పలికిందని, ఈ ఏడాది టన్ను ధర రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకు ఉందని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పుచ్చ పంట దిగుబడి తగ్గిందని, దీంతో ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో పుచ్చకాయ సాగు చాలా తక్కువగా ఉన్నందున వ్యాపారులు వైఎస్సార్, చిత్తూరు జిల్లాలు, బెంగళూరు ప్రాంతాల నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో కూడా అక్కడక్కడా రైతులు పుచ్చసాగు చేయగా దాదాపు పంట చివర దశకు వచ్చింది. దీంతో పుచ్చకాయలను దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని తెలుస్తోంది.

ఫుల్ డిమాండ్

పుచ్చ వ్యాపారంలో మంచి లాభాలు ఉండడంతో ఎక్కువ మంది వ్యాపారులు పోటీ పడి పుచ్చకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, జలదంకి తదితర ప్రాంతాల్లో విరివిగా దుకాణాలు ఏర్పాటు చేసి పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు కిలోల చొప్పున పుచ్చకాయలను విక్రయిస్తుండగా.. కొన్నిచోట్ల కాయలను ముక్కలుగా కోసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. అక్కడక్కడా జ్యూస్ కూడా తయారు చేసి విక్రయిస్తున్నారు. పుచ్చకాయలు వారం, పది రోజులపాటు నిల్వ చేసుకునే అవకాశం ఉన్నందున వ్యాపారులు టన్నుల కొద్ది లారీలు ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు.

పోషకాలు మెండు



పుచ్చకాయలో విటమిన్–బి, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్ లేకపోవడంతో అందరూ పుచ్చకాయలను, జూస్‌ను ఇష్టపడతారు. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్‌తోపాటు పీచు పదార్థాలు ఉండడంతో శరీరానికి, మూత్రపిండాలు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగం. పుచ్చకాయ తినడం వల్ల మలబద్ధకాన్ని నివారించవచ్చు. ఇందులో ఉండే బీటా కెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యలను నివారిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు

సంగం: సంగం మండలం తలుపూరుపాడు గ్రామంలోని గిరిజనకాలనీ తూర్పువీధిలో మురుగు కాలువను సర్పంచ్ కుమారుడు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. సోమవారం సంగంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరిరావును గ్రామస్తులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ తలుపూరుపాడు గిరిజనకాలనీలో గిరిజనులు, ముస్లింలు, బీసీలు నివసిస్తున్నారని, కాలనీలోని తూర్పువీధిలో 2008లో సిమెంటు రాళ్లతో మురుగు కాలువ నిర్మించారని, ప్రస్తుతం ఆ కాలువ మట్టి, చెత్తతో నిండిపోయి ఉందని తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ కుమారుడు అదే వీధిలో ఇల్లు నిర్మిస్తూ ప్రహరీ నిర్మాణం కోసం మురుగు కాలువను జేసీబీతో తవ్వి పిల్లర్లు వేస్తున్నాడని, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పరిశీలించి నిర్మాణం నిలిపివేయాలని చెప్పినా లెక్క చేయకుండా పనులు కొనసాగిస్తున్నారని, అధికారులు స్పందించి వెంటనే మురుగు కాలువ ఆక్రమించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



మురుగు కాలువను ఆక్రమించి పిల్లర్లు వేస్తున్న దృశ్యం

మద్యం దుకాణాల వేళల్లో మార్పులు

ఉదయగిరి: ప్రభుత్వ మద్యం దుకాణాల సమయాన్ని మార్పు చేసినట్లు ఉదయగిరి ఎక్సైజ్ సీఐ రమణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటున్నారని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 6వ తేదీ వరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటలకు వరకు మాత్రమే మద్యం దుకాణాలు తెరిచి ఉంటాయని తెలిపారు.

23న ఆలయ భూములకు కౌలు వేలం

కలిగిరి: మండలంలోని వెలగపాడులో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీపార్వతి నాగమల్లేశ్వరస్వామి దేవస్థానం ఆలయ భూములకు సంబంధించి ఈ నెల 23న కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎన్‌వీ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఆలయానికి సంబంధించిన 105.33 ఎకరాలకు సంవత్సర కాలానికి కౌలు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9441280981 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు వద్దనున్న ఉప్పుటేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొండాపురం ఎస్సై మహేంద్ర సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు భీమవరప్పాడు గ్రామానికి చెందిన కె.రఘుపతి అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి 2 గంటల సమయంలో వాగులో నుంచి ఇసుక తరలిస్తుండగా తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. సిబ్బందితో వెళ్లి ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

ఉదయగిరి: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఆయన సోమవారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ అల్లర్లు, గొడవలకు పాల్పడవచ్చని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

- గరుడ వాహనంపై విహరించిన శ్రీరాముడు

చేజర్ల: మండలంలోని పుట్టుపల్లి గ్రామంలో ఉన్న శ్రీపట్టాభిరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో అర్చకుడు జి.శ్రీహరి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడు ప్రత్యేక వాహనంపై అలంకరించిన గరుడ వాహనంపై కొలువుదీరి గ్రామంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు సీతారాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



గరుడ వాహనంపై విహరిస్తున్న సీతారాములు

పోలీస్ యాక్ట్ 30 అమలు

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీస్ డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ ఎస్.కోటారెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరులోని తన కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు, ఎస్పీ ఆదేశాలతో పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్లలో పోలీస్ యాక్ట్ 30 అమలయ్యేలా ఎస్సైలను ఆదేశించామన్నారు. ఈ యాక్ట్ ప్రకారం ఎక్కువ మంది గుమికూడరాదని, సభలు, సమావేశాలు, ప్రదర్శనలు చేయరాదని తెలిపారు. ఇదే క్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక దళాలు ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన 15 రోజుల వరకు వారికి కేటాయించిన ప్రాంతాల్లో భద్రత విధులు నిర్వహిస్తారని తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ జి.వేణు, ఎస్సై ముత్యాలరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

ఓటుకు దూరంగా..

- చైతన్యం కలిగిస్తున్నా కదలని జనం
- అయినా పెరుగుతున్న పోలింగ్ శాతం
- ఉదయగిరిలో తగ్గుతున్న సంఖ్య

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వేలాది మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాల గడప తొక్కలేదు. ఓటు వేయకుండా దూరంగా ఉన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు చాలా ముఖ్యమని, ఓటు వేయకుండా దూరంగా ఉండడం మంచిదికాదని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు. కొందరు ఓటర్లు ఎందుకు ఓటు వేయడం లేదో అర్థంకాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగం తప్పనిసరి చేయాలనే వాదన కూడా వినిపిస్తోంది.

ఓటుపై అనాసక్తి

ఉదయగిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 43,707 మంది ఓటు వేయలేదని తెలుస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 2,41,677 ఓట్లు ఉండగా, 1,97,970 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 40,254 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. అప్పట్లో మొత్తం 2,31,037 ఓట్లు ఉండగా, 1,81,783 మంది మాత్రమే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేశారు. అలాగే 2014లో 78,363 మంది ఓటు వేయలేదు. ఆ ఎన్నికల్లో మొత్తం 2,26,246 ఓట్లు ఉండగా, 1,47,883 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఓటు వేసే వారు తగ్గినా పోలింగ్ శాతం మాత్రం క్రమేణా పెరుగుతుండడం గమనార్హం. 2014లో 77.1 శాతం, 2019లో 78.6 శాతం, 2024లో 81.92 శాతం పోలింగ్ నమోదైంది. ఇంత పెద్ద సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోకపోవడానికి వలస ఓటర్లు.. తమ ఊర్లకు వచ్చి ఓటు వేయకపోవడమా.. లేక ఓటు వేయటానికి ఆసక్తి లేకపోవడమా.. అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్)

భారీగా పెరిగిన పోలింగ్ శాతం

ఈ ఎన్నికల్లో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం నమోదైంది. గత ఎన్నికలకు.. ఈ దఫా ఎన్నికలను పరిశీలిస్తే ఈసారి సుమారు 3.32 శాతం ఎక్కువగా పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలోని జలదంకి మండలంలో అత్యధికంగా 85.95 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సీతారామపురంలో 76.80 పోలింగ్ జరిగింది. దుత్తలూరులో 80.35 శాతం, కలిగిరిలో 83.34 శాతం, కొండాపురంలో 82.26 శాతం, ఉదయగిరిలో 80.09 శాతం, వింజమూరులో 78.20 శాతం, వరికుంటపాడులో 85.54 శాతం పోలింగ్ నమోదైంది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి 2014లో తప్ప ఓటింగ్ శాతం పెరిగిన ప్రతిసారీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే భారీ మెజారిటీతో విజయం సాధించారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ సారి కూడా అలాంటి ఫలితాలే పునరావృతమవుతాయని చెబుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నెల్లూరు(క్రైమ్): నగర పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నెల్లూరు నగర సబ్‌డివిజన్ పరిధిలో ఏపీ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీల నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉందని తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతిస్తామన్నారు. పెట్రోల్, డీజల్ లూజు విక్రయాలు చేయారాదని పెట్రోల్‌బంకుల నిర్వాహకులకు సూచించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, ఎన్నికల కేసుల్లో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూసారం పరిరక్షణపై అవగాహన

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్ పేట, అనుమసముద్రం గ్రామాల్లో సోమవారం భూసారం పరిరక్షణపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి రజని మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించాలంటే సేంద్రియ ఎరువులైన పేడ ఎరువు, వర్మీ కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు వేయాలని, ప్రస్తుతం పేడ ఎరువు తగినంత లేనందువల్ల పచ్చిరొట్ట పైర్లు అయిన జీలగ, జనుము, పిల్లిపెసర, పెసర సాగు చేసి పూత దశకు ముందు భూమిలో కలియ దున్ని దమ్ము చేయాలని సూచించారు. తద్వారా భూసారం పెరిగి పంటలో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట: మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి రజని

రైతుభరోసా కేంద్రాల్లో..

మర్రిపాడు: మండలంలోని పొంగూరు, భీమవరం రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం భూసారం పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి.. సేంద్రియ, జీవన, పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించి భూసారం పెంచుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలగలు, జనుములు, పిల్లిపెసర్లు కావాల్సిన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకుంటే 50 శాతం రాయితీతో విత్తనాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యు.పెంచలయ్య, బి.ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ఆత్మకూరురూరల్: ప్రతి రైతు భూసార పరిరక్షణ చర్యలు చేపట్టాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ వి.దేవసేనమ్మ తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని వాశిలి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ భూమి ఆరోగ్యం, భూసార పరిరక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఇంద్రాణి, వీఏఏ ఈశ్వరయ్య, రైతులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని 1, 2 రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా భూసారం పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులపై ఆధారపడి నేల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల పంటల్లో పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతుందని తెలిపారు. భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌పీ పద్మ, వీఏఏ షేక్ మైమున్నిసా, ఐసీఆర్‌పీ వెంకటేశ్వర్లు, రాపూరు బాలకొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు

కలిగిరి: మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు పిల్లిపెసర, జీలగ, జనుములు 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నామని వ్యవసాయాధికారి ఎం.సురేష్‌బాబు సోమవారం తెలిపారు. మండలానికి 22 క్వింటాళ్ల జీలగలు, 143 క్వింటాళ్ల పిల్లిపెసర్లు, 116 క్వింటాళ్ల జనుములు మంజూరయ్యాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

ఉదయగిరి: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.ఆంజనేయులు నాయక్ తెలిపారు. ఆయన సోమవారం ఉదయగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీ పోను రైతులు 10 కేజీల జీలగల కోసం రూ.440, 10 కేజీల జనుముల కోసం రూ.440, 8 కేజీల పిల్లిపెసర్ల కోసం రూ.536 రైతుభరోసా కేంద్రాల్లో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు రైతులకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు

జలదంకి: పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని జలదంకి మండల వ్యవసాయాధికారిణి ఎం.శైలజ తెలిపారు. ఆమె సోమవారం జలదంకిలోని రైతుభరోసా కేంద్రంలో పచ్చిరొట్ట పైర్ల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు అయిన జీలగ, జనుము, పిల్లిపెసర, అలసంద, పెసర వంటి పైర్లను పూత దశకు వచ్చిన వెంటనే దమ్ము చేస్తే భూసారం పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

యోగా, ధ్యానంతో ఏకాగ్రత



మనుబోలు : యోగా, ధ్యానం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని యోగా ట్రైనర్ కోటేశ్వర్ రెడ్డి తెలిపారు. మనుబోలు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగా, ధ్యానం ప్రాధాన్యతను వివరించి వారి చేత యోగా, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సెలవుల్లో చిన్నారులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గాల వైపు మళ్లేందుకు ఈ శిబిరాలు దోహదపడుతాయన్నారు.